సాక్షి జగిత్యాల

గురువారం । 14 । నవంబర్ । 2024



నృసింహాలయంలో కార్తీక సందడి

ధర్మపురి: కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు.



గోదావరికి గంగాహారతి

ధర్మపురి వద్దగల గోదావరికి గంగాహారతి నిర్వహించారు. మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు.

8లో▸

గరిష్టం/కనిష్టం 30.0/20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. కొన్నిచోట్ల తేలికపాటి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లారీల కొరత లేకుండా చూడాలి



అయిలాపూర్‌లో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్లరూరల్: ధాన్యం కొనుగోలుకు సంబంధించిన లారీల కొరత ఉంటే సమాచారం అందించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని అయిలాపూర్, ధర్మారంలో కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనాలని సూచించారు. అయిలాపూర్‌లో కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలించారు. కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ ఓడెల రామకృష్ణ, ఆర్‌ఐ వై.రాజేందర్ రావు, ఐకేపీ ఏపీఎం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



వెల్దుర్తిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జితేంద్రప్రసాద్

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారి జితేంద్రప్రసాద్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి, వంజరిపల్లి, నర్సింగాపూర్, అంతర్గాంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని పేర్కొన్నారు. ఏపీఎం గంగాధర్, మార్కెటింగ్ సీసీ సత్యనారాయణ, ఏఈవో రమ్య, సీసీలు మరియ, విద్యాసాగర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

చెన్నకేశవనాథ ఆలయ అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు కోరారు. బుధవారం ఆలయ ఆవరణలో యువజన సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఆలయాన్ని దాతలు సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని, ఇందుకు త్వరలో కమిటీ వేస్తామని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ తుల సదాశివరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, మచ్చ నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు సుంకె శంకర్, చింత శివకుమార్, గంప ఆనందం, చౌడారపు లక్ష్మీనారాయణ, సింగని గంగాధర్, తాటిపాముల గోవర్దన్, కడకుంట్ల లక్ష్మీనారాయణ, యువజన సంఘాల నాయకులు సామల్ల సతీశ్, శ్రీనివాస్, ధర్మపురి, మహిపాల్‌రెడ్డి, మహేందర్, అనిరుద్, సతీశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'సహకార' వారోత్సవాలు

జగిత్యాలఅగ్రికల్చర్: ఈనెల 14 నుంచి వారం పాటు అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ తెలిపారు. వారోత్సవాలను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించనున్నారు. 14న జగిత్యాల సింగిల్ విండోలో, 15న భూపతిపూర్‌లో, 16న జిల్లాకేంద్రంలోనిఅన్నపూర్ణమండల పరస్పర సహకార సంఘంలో, 17న కొడిమ్యాలలో, 18న మెట్‌పల్లిలో, 19న జగిత్యాల పట్టణంలో, 20న వెల్గటూర్‌లోకార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

121 మంది పెన్షన్ రికవరీ నిలుపుదల

జగిత్యాల: జిల్లాలోని 121 మంది పెన్షనర్లకు కమ్యునిటెడ్ వాల్యు పెన్షన్ (సీవీపీ) రికవరీ నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినట్లు పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల కాపీని ట్రెజరీ అధికారి సోఫియాకు బుధవారం అందించారు. 15ఏళ్ల పెన్షనర్లపై సీవీపీ రికవరీ చేయడంపై హైకోర్టులో తమ అసోసియేషన్ కేసు వేసిందని, దీనిపై మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. దీని ద్వారా పెన్షనర్లకు ఊరట కలిగిందని బొల్లం విజయ్, ప్రకాశ్ రావు, విశ్వనాథం తెలిపారు.

ప్రత్యామ్నాయమే ఆదుకుంది!

- పెద్దపల్లి–నిజామాబాద్ రూట్లో 16 రైళ్ల మళ్లింపు
- నాటి ప్రధాని పీవీ ముందుచూపు ఫలితం
- చొప్పదండి, జగిత్యాల మార్గంలో రోజంతా గేటు కష్టాలు
- రాఘవాపూర్ ఘటనతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- బోసిపోయిన రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట స్టేషన్లు



రాఘవాపూర్ సమీపంలో బుధవారం రాత్రి కొనసాగుతున్న ట్రాక్ పునరుద్ధరణ పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ వద్ద మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వే లైన్ ప్రాధాన్యం మరోసారి చర్చకు వచ్చింది. వాస్తవానికి ఈ మార్గాన్ని గూడ్స్ బండ్లు నడిపేందుకు మాత్రమే ఎక్కువ వినియోగిస్తున్నారు. వాణిజ్యపరంగా లాభసాటిగా ఉన్నా ఆశించిన మేర ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడం లేదు. కానీ, గూడ్స్ రైలు ప్రమాదంతో ఈ రూట్ ప్రాధాన్యం ఏంటో దక్షిణ మధ్య రైల్వే అధికారులకు మరోసారి తెలిసివచ్చింది. ఢిల్లీ, మహారాష్ట్ర వెళ్లాల్సిన 16 నుంచి 20 రైళ్లను బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ మీదుగా మళ్లించారు. దీంతో నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట రైల్వేస్టేషన్లు బోసిపోయాయి.

రైలుగేట్లు పడటంతో ఇబ్బందులు

కరీంనగర్ రైల్వేస్టేషన్ వద్ద చొప్పదండి మీదుగా మంచిర్యాల వైపు వెళ్లే ప్రయాణికులు బుధవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాఘవాపూర్ వద్ద మరమ్మతుల నేపథ్యంలో ఢిల్లీ వైపు వెళ్లే రైళ్లను కరీంనగర్ మీదుగా మళ్లించడంతో కరీంనగర్, ఆరెపల్లి, గంగాధర ప్రాంతాల్లో పలుమార్లు రైలు గేట్లు వేయాల్సి వచ్చింది. దీంతో చొప్పదండి మీదుగా కరీంనగర్‌కు వచ్చే అంబులెన్సులు, అందులోని రోగులు, వాహనాదారులు, కరీంనగర్ నుంచి ఎన్‌హెచ్–563 మీదుగా జగిత్యాల, నిజామాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కరీంనగర్‌లో నిర్మిస్తున్న ఆర్వోబీ పనులు నత్తనడకన సాగుతుండటంతో వీరి కష్టాలను మరింత పెంచుతోంది.



బోసిపోయిన జమ్మికుంట రైల్వేస్టేషన్

1993లో పెద్దపల్లిలో శంకుస్థాపన

1993లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు ముందుచూపు వల్ల పెద్దపల్లి–నిజామాబాద్ మార్గం మనుగడలోకి వచ్చింది. ఆ ఏడాది జూన్ 30న పెద్దపల్లిలో ఈ రూట్‌కు(178 కిలోమీటర్లు) శంకుస్థాపన చేశారు. అయితే, నిధుల కేటాయింపులో పెద్దగా ప్రాధాన్యం దక్కకపోవడంతో పూర్తవడానికి (2017లో విద్యుదీకరణ) 24 ఏళ్లు పట్టింది. అయినా, నేటికీ ఇది సింగిల్ లైన్‌గానే కొనసాగుతోంది తప్ప డబ్లింగ్‌కు నోచుకోవడం లేదు. అదే సమయంలో కొత్తపల్లి–మనోహరాబాద్(151 కి.మీ.) మార్గం రెండేళ్లలో పూర్తవనుంది. అలాగే, ఆర్మూర్–ఆదిలాబాద్ (121 కి.మీ.) లైన్ పూర్తయితే.. భవిష్యత్తులో కరీంనగర్ ఈ ప్రాంతానికి రైల్వే కేంద్రంగా మారనుంది. ప్రస్తుతం కాచిగూడ, తిరుపతి, దాదర్‌ముంబై తదితర కొన్ని రైళ్లు మాత్రమే ఉమ్మడి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఈ మార్గాన్ని డబ్లింగ్ చేసి, రెగ్యులర్ రైళ్లు నడిపితే ఉత్తర తెలంగాణ రవాణాలో సరికొత్త అధ్యాయం లిఖిస్తుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్టీసీ ఏర్పాట్లు..



కిక్కిరిసిన పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండు

రాఘవాపూర్ వద్ద రైలు పట్టాలు తప్పడంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే కరీంనగర్ ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాలలో దిగాల్సిన ప్రయాణికుల కోసం అర్ధరాత్రి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు వేసి, గమ్యస్థానాలకు చేర్చారు. అదే సమయంలో కాజీపేట–బల్లార్షా మీదుగా నడిచే 39 రైళ్లను పూర్తిగా, 7 రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. 61 రైళ్లను దారి మళ్లించారు. మరో ఏడింటిని రీషెడ్యూల్ చేయడంతో దూరప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చెన్నై నుంచి అహ్మదాబాద్ నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి గయా వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి లక్నో బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, మధురై నుంచి ఢిల్లీ నిజాముద్దీన్ తమిళనాడు సంపర్క్ క్రాంతి, ఎస్ఎంవీటీ బెంగళూరు నుంచి దానాపూర్ పాట్నా సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, బిలాస్‌పూర్ నుంచి తిరునల్వేలి వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లను పెద్దపల్లి–నిజామాబాద్ మార్గంలో మళ్లించారు. దీంతో ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో ఆయా రూట్లలో రద్దీ పెరిగింది.



బాలల నేస్తం.. చాచా నెహ్రూ..

నేటి బాలలే రేపటి పౌరులు, రేపటి జాతి సంపదలు.. విరిసీవిరియని కుసుమాలు సరైన విద్యతో మాత్రమే మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చు సుసంపన్నమైన దేశం కోసం.. సిద్ధమవుతున్న నేటి ఆణిముత్యాలే రేపటి మన జాతి రత్నాలు. తల్లిదండ్రుల కలల ప్రతిరూపాలు.. భావి భారత పౌరులు. వారికి విద్యతో పాటు మంచి విలువలను నేర్పుదాం. పాల బుగ్గల నవ్వులు, అపురూపమైన క్షణాలు.. మరపురాని జ్ఞాపకాలు.. బాల్యం ఒక వరం. పిల్లలు భగవంతుని స్వరూపాలు.. కల్లకపటం ఎరుగని కరుణామయులు.. రివ్వున ఎగిరే గువ్వలు..

నవంబర్ 14 వచ్చింది.. బాలలకు బోలెడు సందడి తెచ్చింది. ఈ రోజంటే పిల్లలకు పండగ లాంటిది. బాలల దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా వేడుకలా జరుపుకొంటారు. నెహ్రూకు పిల్లలన్నా, గులాబీలన్నా అమితమైన ప్రేమ. పిల్లలకు కూడా పండిట్ నెహ్రూ అంటే వల్లమానిన ప్రేమ. ఆయణ్ని ముద్దుగా 'చాచా నెహ్రూ', 'చాచాజీ' అని పిలుచుకుంటారు. అందుకే 1889 నవంబర్ 14న నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవం జరుపుకుంటారు. ఆయన బర్త్‌డేను 'చిల్డ్రన్స్ డే' నిర్వహించడం ఆనవాయితీ. ఈ రోజున పాఠశాలల్లో పండగ వాతావరణం ఉంటుంది. పిల్లలకు ఇష్టమైన చాక్లెట్లు, ఇతర కానుకలను పంచిపెడతారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పిల్లల్లో ఉత్సాహం నింపుతారు. హ్యాపీ చిల్డ్రన్స్ డే..

గ్రూప్–3కి ఏర్పాట్లు చేయండి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

- సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి

జగిత్యాల: గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈనె 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు, తిరిగి మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5వరకు, మళ్లీ 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రి స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చాలన్నారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, తహసీల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను నియమించాలని సూచించారు. కలెక్టర్ సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నమ్మకముంటేనే ఉన్నత శిఖరాలకు..

కొండగట్టు(చొప్పదండి): విద్యార్థులు తమపై నమ్మకం పెంచుకుని చదవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుతారని జేఎన్టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు అన్నారు. కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వర్సిటీలోని సదుపాయాలు వినియోగించుకోవాలని, సమస్యలు, సందేహాలు ఉంటే ఆచార్యులను సంప్రదించాలని సూచించారు. ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులు కొత్తకొత్త సవాళ్లను ఎదుర్కొంటారని, కొత్త మిత్రులతో కలిసి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇది ర్యాగింగ్ లేని కళాశాల అని స్పష్టం చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఈవిక్స్ డైరెక్టర్, చీఫ్ ఇంజినీర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర రెడ్డి, హెచ్‌ఓడీ కె.వసంత కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వర్సిటీ సిబ్బంది

నూకపల్లిలో వృద్ధాశ్రమం

- ప్రారంభించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మల్యాల: మండలంలోని నూకపల్లి శివారులో నిర్మించిన గండ్ర రాధ, రాఘవేంద్రరావు ప్రశాంత నిలయం (వృద్ధాశ్రమం)ను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, హైకోర్టు న్యాయవాది గండ్ర మోహన్‌రావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. వృద్ధాశ్రమానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. వృద్ధాశ్రమం నిర్మాణానికి మోహన్‌రావు రూ.50లక్షలు విరాళంగా అందించడంపై అభినందించారు. మోహన్‌రావు మాట్లాడుతూ తన తల్లిదండ్రుల స్మారకార్థం వృద్ధాశ్రమానికి విరాళం అందించామని, భవిష్యత్‌లో మరింత సహకారం అందిస్తానని అన్నారు. వెల్మ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. గత ప్రభుత్వంలో ఈ వృద్ధాశ్రమం నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు, పద్మనాయక సంక్షేమ మండలి అధ్యక్షుడు యాచమనేని వేంకటేశ్వర రావు, జువ్వాజి కృష్ణారావు, డాక్టర్ వికాస్‌రావు, వెలమ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

పాదయాత్రతో ఒరిగిందేమీలేదు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): బీఆర్‌ఎస్ నాయకులు చేపట్టిన రైతు పాదయాత్రతో ఒరిగిందేమీలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ, కోరుట్ల నియోజకవర్గాల్లో 43వేల ఎకరాలకు సాగునీరందించే కలిగోట సూరమ్మ ప్రాజెక్టును విస్మరించింది, 2018లో ప్రాజెక్టు కాలువ శిలాఫలకాన్ని ఆవిష్కరించింది మాజీమంత్రి హరీశ్‌రావు కాదా అని ప్రశ్నించారు. తట్టెడు మట్టి తీయకుండా ఇప్పుడు పాదయాత్ర చేయడం సిగ్గుచేటన్నారు. భూషణరావుపేట శివారుని రాళ్లవాగు ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. పాదయాత్ర వారి సొంత ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, ఎన్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ డీఈగా వరుణ్

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ పబ్లిక్ హెల్త్ డీఈగా వరుణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

హరీశ్‌రావు వాస్తవాలు మాట్లాడాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: హరీశ్‌రావు వాస్తవాలు మాట్లాడాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్ హయాంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి ఉమ్మడి రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. ధాన్యం సేకరణలో ఇప్పటికే ముందంజలో ఉన్నామన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. నిర్వాసితులకు న్యాయం చేశాకే మూసీప్రక్షాళన చేస్తామన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీకే సరిపోయిందన్నారు. కాంగ్రెస్ ఏకకాలంలో రూ.18వేల కోట్లు మాఫీ చేశామన్నారు. అడ్లూరి మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని, వారికి త్వరలోనే చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధి, రుణమాఫీపై హరీశ్‌రావు సిద్ధమా అని ప్రశ్నించారు. ధర్మపురిలో పూజలు, యాగాలు చేసిన కేసీఆర్ రూ.500 కోట్లతో అభివృద్ధి చేస్తానంటూ మోసం చేశారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, బల్దియా మాజీ చైర్మన్ విజయలక్ష్మి, నాయకులు బండ శంకర్, మహ్మద్ భారీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చిత్రంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలి

- డీఈవో జగన్మోహన్ రెడ్డి

కోరుట్ల: జాతీయ సాధన సర్వే–2024 పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈవో జగన్మోహన్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. డివిజన్‌లోని ఎనిమిది మండలాల ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో బుధవారం పట్టణంలో సమీక్షించారు. డిసెంబర్ 4న నిర్వహించే జాతీయ సాధన సర్వే (నాస్) పరీక్షలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలిపేందుకు 3, 6, 9 తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు వచ్చేలా ప్రణాళిక చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం, అకాడమిక్ మానిటరింగ్, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, విద్యార్థుల హాజరు, డ్రాప్ బాక్స్‌లపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ, రాజేశ్, సత్యనారాయణ, సంతోష్, అంజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డి

మాటలు కాదు.. సమస్యలపై దృష్టి పెట్టండి

- పాదయాత్రకు విశేష స్పందన
- రైతు సమస్యలు అనేకం
- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

కోరుట్ల: కాంగ్రెస్ నాయకులు పనికిమాలిన ఆరోపణలు చేయకుండా ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రైతు పాదయాత్రకు పెద్ద ఎత్తున తరలివచ్చిన రైతులు, విద్యార్థులు, వివిధవర్గాలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పాలనపై అన్నివర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందని, పాదయాత్రకు వచ్చిన స్పందనతో అది తేటతెల్లం అయ్యిందని చెప్పారు. పాదయాత్రలో పాల్గొన్న రైతులు ధాన్యం కొనుగోళ్లు సరిగా జరగడంలేదని తన దృష్టికి తెచ్చారని వివరించారు. నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు అలాగే ఉన్నాయంటూ రైతులు విలపించారని తెలిపారు. జిల్లాలో 4.50లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 30వేల టన్నులే కొన్నారని, సన్నధాన్యం మాత్రం కిలో కూడా కొనలేదని చెప్పారు. బోనస్ మాటే లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యంతో రైతులు దళారులకు ధాన్యం అమ్మి నష్టపోతున్నారన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ నేతలు, ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశం, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, నాయకులు కాశిరెడ్డి మోహన్‌రెడ్డి, సురేందర్, అస్లాం, ఫయీం, అతిక్ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అన్నివర్గాల్లో అసంతృప్తి

మెట్‌పల్లి: ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొందని ఎమ్మెల్యే సంజయ్ విమర్శించారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు రాలేదని, రుణమాఫీ కాలేదని, రూ.2లక్షలకుపైగా రుణం వారు ఆ మొత్తాన్ని చెల్లించినా సొమ్ము జమ కాలేదని తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. కేంద్రాల్లో ఆంక్షలతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుంటూ నష్టపోతున్నారన్నారు. బల్దియా చైర్‌పర్సన్ రాణవేని సుజాత, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి తదితరులున్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువతి మృతి

• 11న తిరుపతి వెళ్తుండగా రైలు ప్రమాదం


ఉదయశ్రీ (ఫైల్)

కోరుట్ల: రైలు ప్రమాదంలో గాయపడిన ఓ యువతి చికిత్స పొందుతూ మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. కోరుట్లలోని ప్రకాశం రోడ్‌కు చెందిన సామల్ల గణేశ్‌–నీరజ దంపతులు తమ కూతురు ఉదయశ్రీతో కలిసి, గత సోమవారం తిరుపతి వెళ్లేందుకు వరంగల్‌ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ రైలు ఎక్కుతుండగా ఉదయశ్రీ ప్రమాదవశాత్తు జారిపడి, తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు వెంటనే ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఒక్కగానొక్క కూతురి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో కోరుట్లలో విషాదం నెలకొంది.

మాటల్లో దింపి.. మాయ చేశాడు

• రిటైర్డ్‌ ఉద్యోగి నుంచి రూ.లక్ష చోరీ చేసిన ఆగంతకుడు

జగిత్యాల క్రైం: ఓ రిటైర్డ్‌ ఉద్యోగిని మాటల్లో దింపిన ఆగంతకుడు ఆయన వద్ద నుంచి డబ్బులు చోరీ చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రిటైర్డ్‌ ఎంఈవో కందుకూరి రాఘవయ్య మంగళవారం ఎస్‌బీఐలో అవసరం నిమిత్తం రూ.లక్ష డ్రా చేశారు. స్కూటీపై ఇంటికి వెళ్తూ మార్గమధ్యలో మీసేవ వద్ద లైఫ్‌ సర్టిఫికెట్‌ తీసుకునేందుకు ఆగారు. ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తి వచ్చి, మీ డబ్బులు కింద పడిపోయాయని చెప్పారు. ఆయన కిందికి వంగి తీసుకునేలోపే స్కూటీలోని రూ.లక్ష ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

మల్లాపూర్‌(కోరుట్ల): ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌ రెడ్డి తెలిపారు. మల్లాపూర్‌ ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మల్లాపూర్‌ మండలంలోని రత్నాపూర్‌కు చెందిన కండెల రవితేజ, సుద్దపల్లి సాయికుమార్‌ గంజాయికి బానిసలయ్యారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో గంజాయి విక్రయించాలని నిర్ణయించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌కుమార్‌ తన సిబ్బందితో బుధవారం రత్నాపూర్‌ వెళ్లారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన రవితేజ, సాయికుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గంజాయిని నరేశ్‌ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి, చిన్న, చిన్న ప్యాకెట్ల రూపంలో రూ.500కు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్టు చేసి, రూ.5 వేల విలువైన 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఆ ఇద్దరినీ మెట్‌పల్లి కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. హెడ్‌ కానిస్టేబుళ్లు కోటేశ్వర్‌రాజ్‌, నర్సింగరావు, నీలినాయక్‌, కాలీక్‌, కానిస్టేబుళ్లు వెంకటేశ్‌, రత్నాసాగర్‌, నరేందర్‌, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఒకే అకౌంట్‌లో వందల కోట్లు మార్పిడి!

• స్టాక్‌మార్కెట్‌ పేరిట సైబర్‌ క్రైం
• రెండు నెలల క్రితం మెట్‌పల్లి వైద్యుడి ఫిర్యాదు
• పోలీసుల విచారణలో నివ్వెరపోయే నిజాలు
• అదుపులో పంజాబ్‌కు చెందిన ముగ్గురు నిందితులు

కోరుట్ల: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా వందలాది కోట్ల మార్పిడి. మూడేళ్లలో ఓ వ్యక్తి ఖాతాలోకి మళ్లిన నగదు గురించి తెలిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. స్టాక్‌ మార్కెట్‌ పేరిట ఓ ముఠా చేసిన సైబర్‌నేరం ఇది. మెట్‌పల్లికి చెందిన వైద్యుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు తీగ లాగితే డొంగ కదిలింది. రెండు నెలల క్రితం జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లికి చెందిన ఓ వైద్యుడిని స్టాక్‌మార్కెట్‌ యాప్‌ పేరిట ట్రాప్‌లోకి దించిన నిందితులు ఆయన ఖాతా నుంచి రూ.72లక్షలు కాజేశారు. తాను మోసపోయిన విషయం తెలుసుకున్న వైద్యుడు సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీస్‌ ఉన్నతధికారులు ఓ పోలీస్‌ బృందాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసి లోతైన విచారణ కోసం రంగంలోకి దించారు.


దుబాయి కేంద్రంగా..

మెట్‌పల్లి వైద్యుడి కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు విచారణ మొదలుపెట్టిన క్రమంలో స్టాక్‌ మార్కెట్‌ యాప్‌ పేరిట సైబర్‌ క్రైంకు పాల్పడిన నిందితులకు చెందిన బ్యాంక్‌ ఖాతాలను గుర్తించారు. ఈ నిందితులు పంజాబ్‌లోని జలంధర్‌లో ఉన్నట్లు గుర్తించి వారం క్రితం అక్కడికి వెళ్లి మకాం వేశారు. పక్క ప్రణాళికతో ముగ్గురిని పట్టుకున్నారు. ఒక్కొక్కరి ఖాతాలను పరిశీలించి స్టాక్‌మార్కెట్‌ పేరిట సాగుతున్న సైబర్‌క్రైం వివరాలు విచారించారు. ఈక్రమంలో ఒకరి అకౌంట్‌లో 2021 సంవత్సరం నుంచి దాదాపుగా రూ.50వేలు కోట్ల డబ్బుల మార్పిడి జరిగినట్లుగా గుర్తించి నివ్వెరపోయారు. ఈ ముగ్గురు నిందితులకు దుబాయిలోని ఓ ముఠా ద్వారా ట్రాన్‌జాక్షన్‌ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.



పోలీసుల అదుపులో నిందితులు..

మెట్‌పల్లి వైద్యుడిని స్టాక్‌మార్కెట్‌ యాప్‌ పేరిట సైబర్‌ ఉచ్చులోకి లాగిన ముగ్గురు నిందితులను జగిత్యాల జిల్లా ప్రత్యేక పోలీస్‌ బృందం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని పూర్తిస్థాయిలో విచారించేందుకు జలంధర్‌ నుంచి జగిత్యాలకు తీసుకొచ్చినట్లు తెలిసింది. దుబాయి కేంద్రంగా సాగుతున్న సైబర్‌ ముఠా తీరుతెన్నులు. వారితో భాగస్వామ్యులుగా ఉన్న వ్యక్తుల వివరాలు, హవాలా మార్కెట్‌తో ఏమైనా సంబంధాలున్నాయా? అన్న దిశలో పోలీస్‌ విచారణ కొనసాగుతోంది.

రైలు కిందపడి యువకుడి దుర్మరణం

• తిరుపతి జిల్లా గూడూరు రైల్వేస్టేషన్‌లో ఘటన
• మృతుడు చింతలూరువాసి


శ్రీకర్‌ (ఫైల్‌)

రాయికల్‌(జగిత్యాల): ప్రమాదవశాత్తు రైలుకింద పడి, ఓ యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా రాయికల్‌ మండలంలోని చింతలూరుకు చెందిన ముద్దం శ్రీనివాస్‌–జల దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు శ్రీకర్‌(23) ఉన్నారు. కూతురికి వివాహం జరిపించారు. శ్రీకర్‌ బీటెక్‌ పూర్తి చేసి, హైదరాబాద్‌లో ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఈ క్రమంలో బంధువులతో కలిసి తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లాడు. దైవదర్శనం అనంతరం బుధవారం తిరిగి వచ్చేందుకు అక్కడి గూడూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. శ్రీకర్‌ ప్రమాదవశాత్తు రైలుకింద పడి, అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహానికి త్వరగా పోస్టుమార్టం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అక్కడి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ ఫోన్‌లో కోరినట్లు మృతుడి బంధువులు తెలిపారు.

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి

• కాలేయ సంబంధిత వ్యాధితో యువకుడి ఇబ్బంది

రామగిరి(మంథని): కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తన భర్తను కాపాడుకోవడం, కూలీ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలు ఉన్న తన కుటుంబాన్ని సాకడం ఆ ఇల్లాలికి తలకు మించిన భారంగా మారింది. దాతలు ఎవరైనా ఉంటే తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఆమె రెండు చేతులు జోడించి విన్నవిస్తోంది. వివరాలు.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లద్నాపూర్‌ గ్రామానికి చెందిన ఎస్‌కే గౌస్‌ పాషా– రేష్మా దంపతులు. వీరికి కుమారుడు తాజ్‌పాషా ఉండగా, ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి, కూతురు హలీమా మూడో తరగతి చదువుతున్నారు. అయితే, కొంతకాలం క్రితం కాలేయ సంబంధిత వ్యాధికి గురైన గౌస్‌పాషా.. కరీంనగర్‌ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వరంగల్‌ ఎంజీఎంకు వెళ్లాడు. పరీక్షించిన వైద్యులు.. జాండిస్‌ అధికమై కాలేయానికి ఇన్‌ఫెక్షన్‌ సోకిందని నిర్ధారించారు. ఇక్కడ సరైన చికిత్స లభించదని, హైదరాబాద్‌ తీసుకెళ్లాలని సూచించారు. అంతదూరం వెళ్లే, ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స చేయించుకునే స్థోమత లేక స్వగ్రామానికి వచ్చిన గౌస్‌పాషా.. స్థానికంగా తాత్కాలిక చికిత్స పొందుతున్నాడు. మిత్రుల సాయంతో స్థానికంగా ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా. వైద్య ఖర్చులకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు వెల్లడించారు. సొంత ఇల్లులేదు. గుంట భూమి లేదు. రోజువారీ కూలీ పనులు చేసుకునే రేష్మా.. అంతసొమ్ము ఎలా సమకూర్చేదని కన్నీటిపర్యంతమవుతోంది. దాతలు ముందుకు వచ్చి తన భర్తను కాపాడాలని ఆమె కోరుతోంది.


ఆదుకోవాలని వేడుకుంటున్న గౌస్‌పాషా కుటుంబం

దాతలు సంప్రదించాల్సిన బాధితుడి బంధువుల గూగుల్‌ పే, ఫోన్‌పే నంబర్లు :
పాషా : 81860 07873
హైమద్‌ : 93472 03969

‘అల్ఫోర్స్‌ టైనీటాట్స్‌’లో ఖేల్‌ ఉత్సవ్‌

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్‌ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్‌ టైనీటాట్స్‌ పాఠశాలలో ఖేల్‌ ఉత్సవ్‌ బుధవారం ఉత్సాహంగా సాగింది. విద్యాసంస్థల చైర్మన్‌ వి.నరేందర్‌ రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతోపాటు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువస్తాయని తెలిపారు. ఆటలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంచి, మేధాశక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడాంశంలో రాణిస్తూ జిల్లా, రాష్ట్రం, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఫుట్‌బాల్‌, టేబుల్‌ టెన్నిస్‌, ఖోఖో, వాలీబాల్‌, త్రోబాల్‌, కబడ్డీ, టెన్నికాయిట్‌ పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అల్ఫోర్స్‌ చైర్మన్‌ నరేందర్‌ రెడ్డి


రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

అన్నంలో స్క్రబ్బర్‌ తీగ

జగిత్యాల: జగిత్యాలలోని కరీంనగర్‌ రోడ్‌లో గల ఓ రెస్టారెంట్‌లో మున్సిపల్‌ అధికా రులు బుధవారం తనిఖీ చేశారు. నాసిరకం ఆహార పదార్థాలు ఉన్నప్పటికీ రూ.1,000 జరిమానా విధించి, చేతులు దులుపుకున్నారు. ఓ హోటల్లో అన్నంలో స్క్రబ్బర్‌ తీగ రావడంతో కస్టమర్‌ ఆందోళనకు దిగాడు. ఇలాంటివి వస్తుంటాయని యజమాని చెప్పడం విశేషం. మొన్న ఉడిపి హోటల్లో జెర్రీ, చపాతిలో ఫంగస్‌ రాగా, కొత్త బస్టాండ్‌లోని మరో హోటల్లో ఇడ్లీలో ఏకంగా బొద్దింక వచ్చింది. అయితే, హోటళ్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతోందని, తూతూమంత్రంగా తనిఖీలు చేస్తుండటంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బేగంపేట పోస్టాఫీస్‌లో విచారణ

రామగిరి(మంథని): మండలంలోని బేగంపేట పోస్టాఫీస్‌లో నకిలీ పాస్‌ పుస్తకాల వ్యవహారంపై మంథని సీఐ రాజుగౌడ్‌ బుధవారం విచారణ చేపట్టారు. బీపీఎం 54 మంది ఖాతాదారులకు సంబంధించిన రూ.34.87 లక్షలను కాజేసిందని గోదావరిఖని పోస్టల్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనాథ్‌ రెడ్డి మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, గ్రామంలోని ఖాతాదారుల వద్దకు వెళ్లి పాస్‌ పుస్తకాలను పరిశీలించామని తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ముందుకు రావాలన్నారు. ఈ ఘటనపై విచారణ పూర్తయ్యాక అన్ని వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్సై చంద్రకుమార్‌, సిబ్బంది ఉన్నారు.


విచారణ జరుపుతున్న సీఐ రాజుగౌడ్‌

ఆకతాయిలు వేధిస్తే సమాచారం ఇవ్వాలి



బోయినపల్లి: మహిళలను ఆకతాయిలు వేధిస్తే షీటీమ్‌కు సమాచారం అందించాలని వేములవాడరూరల్‌ సీఐ శ్రీనివాస్‌ పేర్కొన్నారు. సైబర్‌ నేరాలు,100 డయల్‌, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై మండలంలోని కోరెం గ్రామ ప్రజలతో బుధవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై దూలం పృథ్వీధర్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మహిళా ఉద్యోగికి దేహశుద్ధి

జగిత్యాల క్రైం: విద్యాశాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగికి ఆమె భర్త, బంధువులు దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల రూరల్‌ మండలంలో పనిచేసే మహిళా ఉద్యోగి బుధవారం సెలవులో ఉన్నారు. అయినా, పనిచేసే చోటుకు వెళ్లింది. ఆమె రెండో వివాహం చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుసుకున్న భర్త బంధువులను వెంటబెట్టుకొని, అక్కడికి చేరుకున్నాడు. అందరూ కలిసి, చితకబాదారు. కానీ, ఆమె తప్పించుకొని, అటెండర్‌ ఇంట్లో తలదాచుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు సాయంత్రం విచారణ చేపట్టారు.

16న స్కాలర్‌షిప్‌ నమోదుపై సదస్సు

సిరిసిల్లటౌన్‌: జిల్లాలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఈనెల 16న ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల నమోదుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్సీడీవో విజయలక్ష్మి ఒక ప్రకటలో తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో సాయంత్రం 4.30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. కొత్తగా వచ్చిన ఆన్‌లైన్‌ ఆపాస్‌లో స్కాలర్‌షిప్‌ రిజిస్ట్రేషన్‌ నమోదుపై అవగాహన కల్పిస్తారని, అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొనాలన్నారు.

చేపపిల్లలతో ఉపాధి పొందాలి

• జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య

గంభీరావుపేట(సిరిసిల్ల)/బోయినపల్లి(చొప్పదండి): మత్స్యకారులు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చేపపిల్లలతో ఉపాధి పొందాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య కోరారు. మండలంలోని గంభీరావుపేట, ముస్తఫానగర్‌, లింగన్నపేటల్లోని 14 చెరువుల్లో సుమారు 1.37లక్షల చేపపిల్లలను బుధవారం పంపిణీ చేశారు. నాయకులు కరువారి శంకర్‌, రాజుగౌడ్‌, అక్కపల్లి బాలయ్య, రాజనర్సు, కుమార్‌, గౌరీశంకర్‌ పాల్గొన్నారు.

నేడు మిడ్‌మానేరులో విడుదల


చేప పిల్లలు అందిస్తున్న డీఎఫ్‌వో సౌజన్య

మిడ్‌మానేరులో గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో చేపపిల్లలు విడుదల చేస్తారని కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి తెలిపారు.

రైల్వే నిర్వాసితులను పట్టించుకోవడం లేదు

• కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

వేములవాడఅర్బన్‌: వేములవాడలోని రైల్వే భూనిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పేర్కొన్నారు. వేములవాడలోని మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రంలో బుధవారం రైల్వే భూనిర్వాసితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వేములవాడకు రైల్వేలైన్‌ పేరుతో భూములను గెజిట్‌ నోటిఫికేషన్‌ ద్వారా క్రయవిక్రయాలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 120 మంది నుంచి భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి రైల్వే లైన్‌ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. నిర్వాసితులు శంకర్‌, నర్సయ్య, శేఖర్‌, ఎల్లయ్య, పద్మ, రేణుక, సుజాత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైల్వే భూ నిర్వాసితులు

పెళ్లికి హాజరై వెళ్తూ.. అనంతలోకాలకు

• కారు ప్రమాదంలో భార్య మృతి. భర్త, కూతురికి గాయాలు
• హైదరాబాద్‌లో ఘటన


రోషిణి (ఫైల్‌)

వేములవాడరూరల్‌: కూతురితో కలిసి బంధువుల పెళ్లికి హాజరయ్యారు.. అందరితో సంతోషంగా గడిపి, తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.. ఈ ఘటనలో భార్య మృతిచెందగా భర్త, కూతురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. వేములవాడరూరల్‌ మండలంలోని లింగంపల్లికి చెందిన కొలిపాక సుమన్‌ హైదరాబాద్‌లోని ఓ బ్యాంకులో పని చేస్తున్నాడు. భార్య రోషిణి(24), కూతురితో కలిసి అక్కడే ఉంటున్నాడు. ముగ్గురూ వేములవాడలో జరిగిన బంధువుల వివాహానికి కారులో వచ్చారు. బుధవారం ఉదయం తిరిగి హైదరాబాద్‌ వెళ్లారు. రింగ్‌ రోడ్డుపై కారు అదుపు తప్పి, ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోషిణి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె భర్త సుమన్‌, కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాంధీ ఆస్పత్రిలో పంచనామా అనంతరం రోషిణి మృతదేహాన్ని బంధువులు స్వగ్రామం లింగంపల్లికి తీసుకొచ్చారు.



అలరించిన నాటక ప్రదర్శనలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని వ్యవసాయ కళాశాలలో బుధవారం రెండో రోజు విద్యార్థుల నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడు రోజులపాటు నిర్వహించే ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల కల్చరల్‌ అండ్‌ లిటరరీ మీట్‌లో భాగంగా విద్యార్థులు వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్థానిక బాబు జగ్జీవన్‌రామ్‌ వ్యవసాయ కళాశాల అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ జి.శ్రీదేవి మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లిష్‌ డిబేట్‌, క్విజ్‌, నాటకాలలో మోనోయాక్టింగ్‌, వన్‌ ఆర్ట్‌ ప్లే, సోలో ఫోక్‌సాంగ్‌, గ్రూప్‌ ఫోక్‌సాంగ్‌, క్రియేటివ్‌ ఆర్ట్స్‌, పోస్టర్‌ మేకింగ్‌, కార్టూనింగ్‌ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.







సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ అర్బన్‌: వేములవాడ రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళావేదిక ప్రాంగణంలో రాజన్న ఆలయ భజన బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

రాజన్న ఆలయంతో తులసీ కల్యాణం



వేములవాడ రాజన్న ఆలయంలో బుధవారం కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా ఉదయం శ్రీ రుక్మిణీ విఠలేశ్వరస్వామివారికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీ తులసీ కల్యాణం వైభవంగా జరిపారు.



ధర్మపురిలో ఘనంగా గంగాహారతి

ధర్మపురి: ధర్మపురి పవిత్ర గోదావరిలో బుధవారం సాయంత్రం గంగాహారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కార్తీక పూజలు జరిపారు. ముందుగా ఆలయం నుంచి గోదావరి నదికి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో వెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. దారి పొడవునా మహిళల హరినామ స్మరణ, కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కణతి తొలగించిన వైద్యులు

• ప్రాణాపాయం నుంచి బయటపడ్డ మహిళ



వేములవాడఅర్బన్‌: వేములవాడ పట్టణంలోని అమృత నర్సింగ్‌ హోమ్‌లో బుధవారం ఓ మహిళ కడుపులో నుంచి భారీ కణతి తొలగించినట్లు వైద్యులు ఆనందరెడ్డి తెలిపారు. డాక్టర్‌ మాట్లాడుతూ చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన మామిండ్ల లచ్చవ్వ తీవ్ర కడుపునొప్పితో ఆస్పత్రికి రాగా.. వైద్యపరీక్షలు చేసి కణతి ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే శస్త్రచికిత్స చేసి 8 కిలోల కణతి తొలగించినట్లు పేర్కొన్నారు. వైద్యులు సుమన్‌మోహన్‌రావు, పెంచలయ్య ఆధ్వర్యంలో ఆపరేషన్‌ చేసినట్లు తెలిపారు.

కార్మికుల పనిభారం తగ్గించాలి

• జిల్లా ఆస్పత్రి ఎదుట కార్మికుల ధర్నా

సిరిసిల్లటౌన్‌: జిల్లా ఆస్పత్రిలో పనిచేసే శానిటేషన్‌, పేషెంట్‌కేర్‌, సెక్యూరిటీ గార్డులకు పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈమేరకు కార్మికులు బుధవారం ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని కోరారు. అన్నల్‌దాస్‌ గణేశ్‌, పద్మ, నాగమణి, దేవలక్ష్మి, తిరుపతి, దేవరాజు, లలిత, రేణ, మమత, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.